"అదేమిటి? మీరు సన్యాస నామంతో పుస్తకం రాసారే మరి?"

"నిజమే. అప్పలరాజు పేరుతో కంటే, స్వామి ప్రణవానంద పేరుతో రాస్తే, అమ్మకాలు ఎక్కువుంటాయని ఆ పేరుతో రాసాను."

సామాన్యుల్లా ఆయనా విషయ లంపటంలో, లౌకిక వ్యవహారాల్లో మునిగి తేలుతున్నాడని గ్రహించిన రామకృష్ణ అడిగాడు.

"రాజుగారూ, సాధారణంగా నిప్పు, నీరు ఎలా కలసి వుండలేవో అలా ఆధ్యాత్మికత, లౌకికత్వం కలసి వుండలేవంటారు. మరి అలాంటి ఆధ్యాత్మిక గ్రంథం ఇలాంటి స్థితిలో వుండి ఎలా రాయగలిగారు?"

"ఏముంది? అనేక పురాణాలు, ధర్మశాస్త్రాలు, మతగ్రంథాలు, భాష్యాలు చదివి, వాటిని వంట పట్టించుకుంటే ఏ రచయితకైనా ఇలాంటి గ్రంథాలు రాయడం తేలికే కదా?" చెప్పాడాయన చిరునవ్వుతో.

"మరి మీరు వంటపట్టించుకుని రాసిన ఆ విషయాలు మిమ్మల్ని ప్రభావితం చేయలేదా?"

"అదా మీ సందేహం? లేదు. కమ్మరి శ్రమించి ఎంతో పదునైన కత్తులు తయారుచేస్తాడు. కానీ తను స్వయంగా వాటితో యుద్ధం చేయడు కదా? కత్తి యుద్ధంలో ఆరితేరినవారి కోసమే అవి. ఇదీ అంతే."

తిరిగి వెళ్తూ రైల్లో అనుకున్నాడు రామకృష్ణ.

'అప్పలరాజు కమ్మరి. తను యుద్ధం నేర్చిన వీరుడు.'

## 22. కష్టాల మూట

ఓ మనిషికి పాపం అన్నీ కష్టాలే! చేసే ఉద్యోగంలోంచి సస్పెండ్ అయాడు. భార్య విడాకులకి నోటీస్ పంపించింది. తల్లికి కేన్సర్ అని తేలింది. చెల్లెల్ని మోసం చేసినతను మొహం చాటేసాడు.

ఆ మనిషికి దేవుడంటే నమ్మకమూ లేదు. అప నమ్మకమూ లేదు. అందుచేత తల్లి సలహా మీద గుడికి వెళ్ళి దేవుణ్ని ప్రార్థించాడు.

"దేవా! లోకంలో ఎందరికో అనేక సుఖాలిచ్చే నువ్వు నాకెందుకు ఇన్ని కష్టాలిచ్చావు? నువ్వంటూ నిజంగా వుంటే, రేపు ఈపాటికల్లా నన్ను ఈ కష్టాల్లోంచి బయట పడెయ్. లేదా నువ్వు లేవని నిర్ధారించుకుంటాను."

ఆ రాత్రి అతను నిద్రకి ఉపక్రమించాక, పూర్తి నిద్ర, పూర్తి మెలకువ కాని మగత స్థితిలో వున్నాడు. అప్పుడతనికి కాంతి శరీరంతో ఒకరు దర్శనమిచ్చారు. ఆయనే దేవుడని గ్రహించిన అతను ఆయనతో చెప్పాడు.

"దేవా! నన్ను ఈ కష్టాల ఊబిలోంచి బయటకి లాగు."

దేవుడు అతని తలని మృదువుగా నిమిరాడు. అతని కష్టాల మూట దేవుడి చేతిలోకి వచ్చింది. దాన్ని దేవుడు అతని చేతికిచ్చి చెప్పాడు.

"పక్క గదిలో చాలా మూటలున్నాయి. దీన్ని అక్కడ వుంచి ఇంకో కష్టాల మూట ఏదైనా తెచ్చుకో."

వెంటనే ఆ మనిషి ఉత్సాహంగా పక్క గదిలోకి వెళ్ళి తన మూటని గిరాటేసి అక్కడ ఉన్న మూటలన్నింటినీ పరిశీలించాడు. వ్యభిచారం, దొంగతనం లాంటివి చేసిన వారి కష్టాల మూటలవి. అవి నచ్చక చివరికి ఓ మూటని ఎంచుకుని, దాంతో బయటకి వచ్చాడు.

"థాంక్యూ దేవా." చెప్పాడతను.

"వత్సా! నువ్వు ఆ గదిలోకి తీసుకెళ్ళిన మూటనే మళ్ళీ తెచ్చావు." దేవుడు చిరునవ్వు నవ్వి చెప్పాడు.

**నీతి:-** దేవుడు మనకి చెందని కష్టాలని మనకెన్నడూ ఇవ్వడు. మనమెంత వరకు అర్హులమో ఆ మేరకే కష్టాలనిస్తాడు.

## 23. నాలుగు స్థితులు

బ్రహ్మవిద్య నేర్చుకోవడానికి ఒకతను ఓ సాధువు దగ్గర చేరాడు.

"స్వామీ! నాకీ జన్మలో నేనే బ్రహ్మన్ని అని తెలుసుకునే అవకాశం వస్తుందా?" అడిగాడు ఓ ఏడాది ఆయనతో వున్న తర్వాత.